
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 7 । ఆగస్టు । 2025



15,461 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జలాశయానికి బుధవారం 15,461 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డెల్టాకు 11,000, పవర్ టన్నెల్‌కు 2,500, ఉత్తరకాలువకు 370, కండలేరుకు 6 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 36.8 టీఎంసీలు ఉన్నాయి.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,290
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,337
3 శాతం జీఎస్టీతో	రూ.9,617
నవర (8 గ్రా)	రూ.76,936

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.1 /28.1

జిల్లాలో గురువారం వాతావరణం మేఘావృతంగా ఉండి, ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ 69 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

నేడు జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

నెల్లూరురూరల్: 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు చేనేత ర్యాలీ జరుగుతుందని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ఉదయం 8.30 గంటలకు మహాత్మాగాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కలెక్టరేట్‌లో ఆప్కో స్టాల్ ప్రారంభోత్సవం, నేత కార్మికులతో సమావేశం జరుగుతుందన్నారు.

కాకాణితో సురేష్, నేదురుమల్లి ములాఖత్



ములాఖత్ తర్వాత బయటకు వస్తున్న ఆదిమూలపు సురేష్, రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం ములాఖత్ అయ్యారు. పలు విషయాలు కాకాణితో చర్చించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శుక్రవారం లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారి ప్రతి పాదనలను 1 ప్లస్ 2 సంబంధిత డిప్యూటీ డీఈఓలకు సమర్పించాలన్నారు. ఆ తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోమన్నారు. మరిన్ని వివరాల కోసం www. deo. nellore.50 webs. com ను సంప్రదించాలన్నారు.

పోరంబోకు భూములపై విచారణ



భూములను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి (సైదాపురం): మండలంలోని కుల్లూరు ఎర్రచెరువు ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్, చెరువు పోరంబోకు భూములు 20 ఎకరాల వరకు కొందరు కూటమి నాయకులు ఆక్రమించి చదును చేశారు. భూముల ఆక్రమణలపై సాక్షి బుధవారం భూములను మింగేస్తున్న 'పోరంబోకులు' శీర్షిక కథనం ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. అయితే క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇది మా పరిధి కాదంటే.. మా పరిధి కాదు అంటూ రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఆక్రమించిన భూమి ఎవరి పరిధిలోకి వస్తుందో తేల్చి తొలగించాల్సింది కూడా రెవెన్యూ అధికారులే.

రోడ్డు ప్రమాదాలపై పోలీస్ స్పెషల్ డ్రైవ్

- జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు
- 39 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు



బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజా వద్ద తనిఖీ

నెల్లూరు (క్రైమ్): రోడ్డు ప్రమాదాల నియంత్రణ చర్యల్లో భాగంగా మంగళ, బుధవారాల్లో జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లు, బ్లాక్ స్పాట్‌లు, జాతీయ రహదారి నిష్కమణ, ప్రవేశ ప్రదేశాల్లో వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న వారిపై 39 కేసులు నమోదు చేసి 26 వాహనాలు సీజ్ చేశారు. సెల్ ఫోను, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధరించని, రికార్డులు సరిగాలేని వాహనదారులకు భారీగా జరిమానాలు విధించారు. ఎస్పీ జి. కృష్ణకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల మేరకు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల ఐదో తేదీ నుంచి 10వ తేదీ వరకు డ్రంక్ అండ్ డ్రైవ్, 11 నుంచి 17వ తేదీ వరకు హైస్పీడ్, 18 నుంచి 24వ తేదీ వరకు హెల్మెట్ లేకుండా ప్రయాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. 25 నుంచి 31వ తేదీ వరకు బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపడుతామని చెప్పారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు.

తెగిన మగ్గం దారం



వైఎస్సార్‌సీపీ పాలనలో..

అనాదిగా నేత వృత్తినే నమ్ముకుని కుటుంబాలను పోషించుకునే చేనేతల జీవితాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కొత్త వెలుగులు నింపారు. గతంలో ఆర్థిక చేయూత లేక మగ్గాలను వదిలేసిన నేత సంప్రదాయ కుటుంబాలు మళ్లీ పగ్గం పట్టాయి. వరుసగా ఐదేళ్లు వారి ఖాతాల్లో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' జమ కావడంతో కదిలిన మగ్గం అవిశ్రాంతంగా సాగాయి. అప్పుల ఊబిలో నుంచి తేరుకున్నాయి.

కూటమి పాలనలో..

చంద్రబాబు గతంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా.. ఏనాడూ చేనేతల అభ్యున్నతికి పాటుపడిన చరిత్ర లేదు. అందుకే సంప్రదాయ వృత్తినే నమ్ముకున్న చేనేతలు బతుకుదెరువు కోల్పోయి, అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్న విషాద ఘటనలు నిత్యకృత్యం అయ్యాయి. గత ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ ఇస్తున్న పథకాలతోపాటు కొత్తగా నేత మగ్గాలకు 200, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత కరెంట్‌తోపాటు 25 రకాల హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చి రెండో ఏడాది గడుస్తున్నా.. ఇంత వరకు వారిని ఆదుకోకపోవడంతో నేతన్న బతుకులు మళ్లీ మొదటికి వచ్చాయి.

చేయూత ఇవ్వక చేనేతకు చుక్కలు



- చంద్రబాబు దగా జాబితాలో నేతన్నలు
- వైఎస్సార్‌సీపీ హయాంలో 'వైఎస్సార్ నేతన్న నేస్తం' అమలు
- ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.1.20 లక్షల సాయం
- అప్పుల ఊబి నుంచి తేరుకున్న చేనేత కుటుంబాలు
- కూటమి రాకతో కుప్పకూలిన బతుకులు
- ఆర్థిక సాయం ఎగనామం
- మగ్గాలకు 200, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత కరెంట్‌కు పంగనామం
- మళ్లీ మొదటికొచ్చిన నేతన్నల జీవితాలు
- జాతీయ చేనేత దినోత్సవం నేడు

జిల్లాలో నేతన్న నేస్తం పథకం అమలు

సం॥	లబ్ధిదారులు	అందిన సాయం (రూ.ల్లో)
2019–20	6,852	16,44,48,000
2020–21	6,340	15,21,60,000
2021–22	5,442	13,06,08,000
2022–23	3,826	9,18,24,000
2023–24	3,966	9,51,84,000

సహకారం అందించాలి



ప్రభుత్వాలు చేనేత రంగానికి సహకారం అందించాలి. అనేక సమస్యలు ఎదుర్కొంటున్న వారికి గతం ప్రభుత్వం ఇచ్చిన పథకాలను పునరుద్ధరించాలి. చేనేతలకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్ నిబంధనలను ఉల్లంఘించి పవర్‌లూమ్ మగ్గాలపై వస్త్రాలను తయారు చేస్తున్నారు. ఆప్కోకు పాలక పార్టీల చేయూత తగ్గిపోయింది. హెల్త్ స్కీంను, కచ్చితంగా అమలు చేయాలి.

– బుధవరపు బాలాజీ, చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు

నేతన్న నేస్తంతో ఆర్థిక ఉపశమనం



చేనేత వృత్తిలో 40 ఏళ్లగా ఉన్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నేతన్న నేస్తం నా కుటుంబానికి ఆర్థికంగా ఉపశమనం కలిగించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మాకు ఎటువంటి మేలు చేయడం లేదు. గత ప్రభుత్వంలో మూలన పడేసి మగ్గాలు మళ్లీ వేగం పుంజుకున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు చాలా దారుణంగా మారాయి. పాలకులు స్పందించకపోతే అందమైన మన చేనేత సంప్రదాయం కనుమరుగవుతుంది.

– బొడిచెర్ల రవి, సంగం

గిట్టుబాటు ధర కూడా రావడం లేదు



రోజంతా కుటుంబం కష్టపడినా రూ.300కు మించి గిట్టుబాటు ధర కూడా రావడం లేదు. ప్రభుత్వాలు ముడి సరుకుల మీద ధరలు తగ్గించాలి. జీఎస్టీని తగ్గిస్తే చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగి కొంచమైనా లాభాలు వస్తాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా బతుకులు మళ్లీ గుంతలో పడ్డాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో నేతకు పెట్టుబడి సాయంతోపాటు అనేక పథకాలు మా కుటుంబానికి ఎంతో దోహదపడ్డాయి.

– మాసాబత్తుల రమణమ్మ, నారాయణరెడ్డి పేట

కూటమి ప్రభుత్వం నెరవేర్చని హామీలతో....

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన పథకాలతోపాటు అదనంగా నేత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు ఉచితంగా సరఫరా చేస్తామని నెరవేర్చలేని హామీలిచ్చింది. వీటితో మరో 25 రకాల హామీలిచ్చినా.. అధికారంలోకి వచ్చి రెండో ఏడాది గడుస్తున్నా.. చేనేత వర్గాలకు ఇచ్చిన హామీలు ఆయా కుటుంబాలకు అందని పరిస్థితి ఏర్పడింది. నూలు, రంగుల ధరలు, జీఎస్టీల దెబ్బ చేనేత పరిశ్రమ మూతపడే స్థాయికి చేరుకుంది. మగ్గం ఉన్న ప్రతి ఒక్కరూ కష్టాలను ఎదుర్కొంటున్నారు. కష్టపడి నేసిన వస్త్రాలు మార్కెట్ చేయాల్సిన ఆప్కో సంస్థ చేస్తున్న పనులు ఎవరికి అర్థం కాని పరిస్థితి. ఆప్కో నిర్వహించాల్సిన చేనేత సంఘాల ఎన్నికలకు డబ్బులు కూడా లేకపోవడంతో ఏ విధంగా సహాయ పడలేని పరిస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. తమను ఏ విధంగా ఆదుకోలేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత జాతీయ దినోత్సవాన్ని ఆర్భాటంగా నిర్వహించడం సిగ్గుచేటని నేతన్నలు దుయ్యబడుతున్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మన సంస్కృతి, సంప్రదాయాన్ని ఉట్టిపడేలా కనిపించేవి చేనేత వస్త్రాలు. అగ్గిపెట్టెలో ఇమిడే చీరలను నేసి చరిత్ర సృష్టించిన చేనేతలు అనాదిగా చంద్రబాబు పాలనలో దగాకు గురయ్యారు. చేనేతలను ఆదుకునేందుకు దివంగత సీఎం ఎన్టీఆర్ జనతా వస్త్రాల పథకానికి శ్రీకారం చుట్టారు. చంద్రబాబు అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకున్నా.. ఆ పథకానికి మంగళం పలికారు. తాను అధికారంలో ఉన్న 14 ఏళ్లు నేతన్నలకు చుక్కలు చూపించారు. వైఎస్సార్ హయాంలో చేనేతలను ఆదుకున్నారు. తిరిగి ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గత ప్రభుత్వాలకు భిన్నంగా చేనేతల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా ఏటా రూ.24 వేల వంతున ఐదేళ్లలో ఆయా కుటుంబాలకు రూ.1.20 లక్షల ఆర్థిక సాయంతోపాటు, నవరత్నాల పథకాల ద్వారా ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేశారు.

ఆదుకోలేని చేనేత సొసైటీలు

జిలాల్లో 280కు పైగా చేనేత సొసైటీలు ఉన్నాయి. నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వారి జీవితాలను ఆనందంగా గడిపేలా ఈ సొసైటీలు పని చేశాయి. నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఉండే సొసైటీలు నేడు కేవలం పుస్తకాల్లో రాసుకునేందుకే సంఖ్య సరిపోతుంది. జిల్లాలో కేవలం సౌత్‌మోపూరు, బుచ్చిరెడ్డిపాళెం, నారాయణరెడ్డిపేట, ఇందుకూరుపేట, నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సొసైటీలు మాత్రం అంతో ఇంతో కార్మికులకు పని కల్పిస్తున్నాయి. అయినా ఆ సొసైటీలు కల్పించే పనులతో ఏ కుటుంబం బతికే పరిస్థితి లేకపోవడంతో చేనేత కార్మికులు రకరకాల పనులతో జీవితం సాగిస్తున్నారు.

ఎవరికీ ఇబ్బంది లేకుండా భూసేకరణ



ఉప్పరపాళెం గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

- కలెక్టర్ ఆనంద్ స్పష్టీకరణ
- ఉప్పరపాళెం, కరేడులో పర్యటన

ఉలవపాడు: ప్రజలందరితో మాట్లాడి అందరిని సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూ సేకరణపై ముందుకెళ్తామని కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. బుధవారం కరేడు, ఉప్పరపాళెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కరేడు ప్రాంతంలో మూడు గ్రామాలు తరలించాల్సిన అవసరం ఉందని, ఆ గ్రామాల్లో సుమారు 70 నుంచి 100 మందితో మాట్లాడినట్లు కలెక్టర్ చెప్పారు. వారికి భూసేకరణకు సంబంధించి చాలా అనుమానాలను ఈ మేరకు నివృత్తి చేశామని, వారికి ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌తో పాటు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. ఎకరాకు రూ.20 లక్షలతోపాటు అదనంగా తోటలు, ఆక్వా కల్చర్ ఉంటే అదనంగా వారికి నగదు అందిస్తామని, రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. 80 ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చేందుకు రైతులు ముందుకొచ్చారని చెప్పారు. అందులో 13 ఎకరాలకు రూ.2.50 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు బుధవారం జమ అయినట్లు తెలిపారు. ముందుగా ఉప్పరపాళెం గ్రామస్తులతో కలెక్టర్ మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు ఒకేచోట ఇళ్లు ఇవ్వాలని కోరారు. హైవేపై గుడ్ న్యూస్ స్కూల్ వద్ద గ్రామాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మీకు నచ్చిన చోట భూమి లేకుంటే భూమికొని అయినా ఇస్తామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఇల్లు కట్టించి ఇస్తామని తెలిపారు. చట్ట ప్రకారం ఇవ్వాల్సిన సదుపాయాలన్ని కల్పిస్తామని చెప్పారు. కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. ఉప్పరపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కరేడు 1వ సచివాలయాన్ని సందర్శించి అక్కడ హైవే పక్కన భూములు కోల్పోనున్న రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రీపూజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సురేష్‌తోపాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీపై దాడి దారుణం

- మాజీ మంత్రి అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ రమేష్‌పై బుధవారం టీడీపీ నాయకులు దాడి చేయడాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ఖండించారు. రెడ్‌బుక్ రాజ్యాంగంతో ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా దాడులకు పాల్పడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వ్యక్తి స్వాతంత్ర్యాన్ని, ఎన్నికల స్వేచ్ఛను హరించే ఇలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

రాష్ట్ర ఐటీ సంయుక్త కార్యదర్శిగా దోరశిల



దోరశిల వెంకటరామిరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన దోరశిల వెంకటరామిరెడ్డిని పార్టీ రాష్ట్ర ఐటీ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

విద్యార్థులకు అస్వస్థత.. తల్లిదండ్రుల ఆందోళన



గురుకుల కళాశాలలో అధికారులను నిలదీస్తున్న కళాశాల పేరెంట్స్ కమిటీ మెంబర్లు



విద్యార్థులకు వైద్య సేవలు అందిస్తున్న కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హేనా, తదితరులు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరులో ఉన్నడాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి ఆరుగురి విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కళాశాలలో రెండేళ్లుగా మంచినీటి సమస్య ఉందని, నాణ్యమైన భోజనం అందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అనేక సార్లు నిరసనలు వ్యక్తం చేసినా కళాశాల యాజమాన్యం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు.

ఉన్నతాధికారుల పరిశీలన

సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల కళాశాలలో ఫుడ్ పాయిజన్ విషయం వెలుగులోకి రావడంతో బుధవారం ఆ శాఖ జిల్లా కన్వీనర్ ప్రభావతి, స్థానిక తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎంఈఓ జయరామనాయుడు తదితరులు కళాశాల, హాస్టల్, మెస్ భవనాలను పరిశీలించారు. విద్యార్థినుల అస్వస్థతకు ఫుడ్ పాయిజన్ కారణమని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి హేనా స్పష్టం చేయడంతో ఆ కోణంలో పరిశీలించారు.

తల్లిదండ్రుల నిరసన

కళాశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి ఆరుగురు విద్యార్థులను అస్వస్థతకు గురైన విషయం తెలియడంతో విద్యార్థునులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున కళాశాలకు చేరుకొన్నారు. తమ బిడ్డలకు ఏమైందో అంటూ ఆందోళనలతో గంటల పాటు కళాశాల గేట్లు ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ మెంబర్లు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్తేరమ్మ నిర్లక్ష్య వైఖరి వల్లే విద్యార్థుల ప్రాణాల మీదకు తెస్తుందని ఆరోపించారు. రెండేళ్ల కలుషిత తాగునీరు, భోజనం సక్రమంగా లేదంటూ విన్నవించినా ఆమె పట్టించుకోలేని మండిపడ్డారు. తల్లిదండ్రులు నిలదీస్తే మా బిడ్డలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రూ.8. లక్షల ఇన్సూరెన్స్ సొమ్మును కాజేశారు

- గిరిజనులనే మోసం చేసిన ఆ సంఘ నేతలు
- బాధితురాలు మారతమ్మ ఆవేదన
- పోలీసులకు, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు



జేసీ కార్తీక్‌కు వినతి పత్రం ఇస్తున్న గిరిజనులు

కోవూరు/నెల్లూరు(అర్బన్) : నా భర్త మరణానంతరం ఇన్సూరెన్స్ సంస్థ నుంచి వచ్చిన రూ.8 లక్షల మొత్తాన్ని గిరిజన సంఘ నేతలమని చెప్పుకునే యానాదుల సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉషా కలిసి కాజేశారని మండలంలోని గుమ్మలదిబ్బ సమీపంలో ఉన్న గాంధీ జనసఘం గిరిజన కాలనీకి చెందిన ఈగ మార్తమ్మ ఆరోపించారు. గిరిజన సంఘ నేతలమని చెబుతూ గిరిజనులనే మోసం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి కోవూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బుధవారం జాయింట్ కలెక్టర్ కే కార్తీక్‌ను కలిసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. బాధిత గిరిజన మహిళ ఈగ మార్తమ్మ భర్త పసుపులేటి సురేందర్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ సమస్యలతో 2020లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కోవూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా, అందుకు సంబంధించి బీమా కంపెనీ నుంచి 2023లో రూ.8 లక్షల ఇన్సూరెన్స్ పరిహారం ఇండియన్ బ్యాంక్‌లోని ఆమె ఖాతా(033310 100222548)లో జమయ్యాయి. అయితే ఈ విషయం తెలుసుకున్న గిరిజన సంఘ నేత కేసీ పెంచలయ్య కుట్రపూరితంగా వ్యవహరించి ఈ డబ్బులు నీవి కావు, నీ అకౌంట్లోకి పొరపాటున వచ్చాయని మార్తమ్మకు చెప్పారు. ఆ తర్వాత ఆమె బ్యాంక్ ఖాతా నుంచి గిరిజన సంఘ మహిళా నేత చెంబేటి ఉషా ఖాతా (0111917603)కు రూ.7 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారని మారతమ్మ ఆరోపిస్తోంది.

పెంచలయ్య, ఉషా వద్దనే ఏటీఎం, పాస్‌బుక్

తనకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఏటీఎం కార్డు, ఆధార్ వంటి ముఖ్యమైన పత్రాలన్నీ కేసీ పెంచలయ్య, ఉషా వద్దనే ఉంచుకుని, మిగతా డబ్బు లు కూడా కాజేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, అధికారులు జోక్యం చేసుకుని నాకు న్యాయం చేయాలని, గిరిజన సంఘా లు, మహిళా సంఘాలు స్పందించాలని కోరారు. బ్యాంక్ లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి, తనను మోసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె కోరారు.

అమాయక గిరిజనులను మోసం చేస్తున్నారు..

జేసీకి వినతిపత్రం అందించిన తర్వాత బాధితులు ఈగ మార్తమ్మ, గరునాధం చందు మాట్లాడుతూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చలామణి అవుతున్న కల్లూరు చిన పెంచలయ్య, చెంబేటి ఉషా అమాయక గిరిజన మహిళలకు రావాల్సిన నగదు కాజేస్తున్నారని ఆరోపించారు. అట్రాసిటీ కేసుల్లో న్యాయం చేస్తామని బాధితుల ఆధార్ కార్డు, పాస్‌బుక్‌లు, ఏటీఎం, పాస్‌కార్డులు వీరి చేతుల్లో పెట్టుకుని బ్యాంకు ఖాతాకు నాయకుల ఫోన్ నంబర్లు లింక్ చేయించుకున్నారన్నారు. అట్రాసిటీకి సంబంధించిన ప్రభుత్వం అందించే నష్టపరిహారం బ్యాంకు ఖాతాలో పడిన వెంటనే చెంబేటి ఉషా ద్వారా బాధితులను పిలిపించుకుని అరకొర చేతిలో పెట్టి పెద్ద మొత్తంలో నగదు కాజేస్తున్నారన్నారు. సజ్జాపురం గ్రామానికి చెందిన గురునాధం చందు భర్త వినోద్‌ను అగ్రవర్ణాల వారు విచక్షణారహితంగా కొట్టిన నేపథ్యంలో వచ్చిన పరిహారం మొత్తం రూ 1.75 లక్షలను కాజేశారన్నారు. మా మాదిరిగా ఎంతో మంది వీళ్ల చేతిలో మోసపోయారని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు

- విధుల్లో నిర్లక్ష్యంపై డ్వామా పీడీ గంగాభవాని ఆగ్రహం



మాట్లాడుతున్న డ్వామా పీడీ గంగాభవాని

పొదలకూరు : ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయకుండా కూలీలకు పనిదినాలు కల్పించకుండా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులను అందజేస్తామని డ్వామా పీడీ గంగాభవాని చెప్పారు. పొదలకూరు ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం పొదలకూరు, కలువాయి, సైదాపురం, రాపూరు మండలాల్లోని ఏపీఎంలు, టీఏలు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో పీడీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ క్లస్టర్ పని తీరు బాగలేదన్నారు. ఏ మండలంలోనూ లక్ష్యాలను అధిగమించే పరిస్థితి లేదన్నారు. ఆగస్టు నెలాఖరు నాటికి లక్ష్యాలను పూర్తి చేయకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. జిల్లాకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.125 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. అయితే ఈ మొత్తాన్ని రూ.70 కోట్లకు కుదించడం జరిగిందన్నారు. కూలీలకు వేతన బకాయిలు రూ.48 కోట్లు ఉండగా రూ.32 కోట్లు చెల్లించామని, మిగిలిన మొత్తం త్వరలోనే చెల్లిస్తామన్నారు.

ఎఫ్ఏలు పనిచేయడం లేదు

క్షేత్ర సహాయకులు (ఎఫ్ఏలు) గ్రామాల్లో సక్రమంగా పనిచేయడం లేదని డ్వామా పీడీ అభిప్రాయపడ్డారు. కొత్తగా నియామకం జరిగిన ఎఫ్ఏలు ఏడాది పూర్తయినా క్షేత్రస్థాయిలో కూలీల వద్ద పనులు చేయించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీల వద్ద కనీసం 4 గంటలు పనిచేయిస్తే వారికి రూ.300 గిట్టుబాటు అవుతుందన్నారు. కొన్ని పంచాయతీల్లో పనులే పెట్టడం లేదని, అలాంటి వారికి షోకాజ్ నోటీసులను అందజేసి నెలాఖరు వరకు పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏపీడీ గాయత్రి దేవి, పొదలకూరు ఎంపీడీఓ నరసింహారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నమ్మకంగా ఉంటూ.. బంగారాన్ని కాజేసి

నెల్లూరు(క్రైమ్): నమ్మకంగా ఉంటూ.. ఆభరణాల తయారీకి ఇచ్చిన బంగారును కాజేసిన వ్యక్తిపై కేసును చిన్నబజార్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పొగతోటలో నివాసం ఉంటున్న రాకేష్ చౌదరి మధ్వపతివారి వీధిలో జ్యువెలరీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. మహమ్మద్ అలీ వద్ద బంగారు ఆభరణాలను తయారు చేయిస్తున్నారు. ఈ క్రమంలో 196.78 గ్రాముల బంగారాన్ని ఆభరణాల తయారీ నిమిత్తం గత నెల రెండో తేదీన రాకేష్ చౌదరి ఇచ్చారు. చెప్పిన సమయానికి ఆభరణాలను ఇవ్వకపోవడంతో వ్యాపారి గట్టిగా నిలదీశారు. 50 గ్రాములను ఇచ్చి మిగిలిన బంగారం పోయిందని బదులిచ్చారు. బంగారాన్ని కాజేయడమే కాకుండా అడుగుతుంటే బెదిరిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన మహిళపై లైంగిక దాడి

సంగం: మండలంలోని కొరిమెర్ల మామిడితోటలో కాపలాదారుగా ఉన్న తనపై యజమాని లైంగిక దాడికి పాల్పడ్డారంటూ సంగం పోలీసులకు గిరిజన మహిళ ఫిర్యాదు చేశారు. వివరాలు.. సంగానికి చెందిన వెల్డింగ్ వర్క్ చేస్తున్న యూసఫ్‌కు కొరిమెర్ల సమీపంలో మామిడి తోట ఉంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం గిరిజన మహిళ, తన భర్త, కుమార్తెతో కలిసి కాపలాదారులుగా చేరారు. అప్పటి నుంచి ఆమెను యూసఫ్ వేధించసాగారు. ఈ నెల మూడో తేదీ రాత్రి మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనిపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం కేసును ఎస్సై రాజేష్ బుధవారం నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రైలు కిందపడి వృద్ధుడి మృతి



కావలి (జలదంకి): రైలు కిందపడి వృద్ధుడు మృతి చెందిన ఘటన ముసునూరు వద్ద నిర్మాణంలో ఉన్న అండర్ బ్రిడ్జి సమీపంలో మూడో లైన్ వద్ద బుధవారం చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 65 నుంచి 70 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. గోధుమ రంగు చొక్కా, గ్రీన్ కలర్ పూల లుంగీని ధరించి ఉన్నారు. చేతి కర్ర, బూడిద రంగు టవల్ లభ్యమయ్యాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు 94406 27648 నంబర్‌ను సంప్రదించాలని కావలి జీఆర్పీ ఎస్సై వెంకట్రావు కోరారు.

పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి: రూ.25
సన్నవి: రూ.15
పండ్లు: రూ.5

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్:	రూ.102
లేయర్	రూ.112
బ్రాయిలర్ చికెన్:	రూ.200
స్కిన్‌లెస్ చికెన్:	రూ.222
లేయర్ చికెన్:	రూ.190

పొగాకు.. కాదు పగాకు

చుట్ట.. బీడీ.. సిగరెట్.. జర్దా.. ఖైనీ.. ఇలా పేరేదైనా వీటన్నింటిలో వినియోగించేది పొగాకే. ధూమపానం.. పొగాకు నమలడంతో నోటి, ఊపిరితిత్తులు, జీర్ణాశయ కేన్సర్ బారిన పడే వారు సమాజంలో రోజురోజుకూ ఎక్కువవుతున్నారు. ఫలితంగా ఆరోగ్య.. ఆర్థికపరంగా చిక్కి శల్యమవుతున్నారు. పెద్ద దిక్కును కోల్పోతే కుటుంబం చిన్నాభిన్నమవుతుంది. ఈ తరుణంలో పరిస్థితిని చక్కదిద్దాలనే లక్ష్యంతో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ నియంత్రణలో భాగంగా జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని వైద్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టారు.

- వైద్యశాఖ ఆధ్వర్యంలో గత నెల ఒకటి నుంచి వినూత్న ప్రయోగం
- కాలనీల్లో ముమ్మర ప్రచారం
- ధూమపానం చేయమంటూ విద్యార్థులతో సంతకాల సేకరణ
- ఎక్కువ సేకరించిన వారికి ఆగస్ట్ 15న బహుమతులు
- చికిత్సతో వెయ్యి మందికి అలవాటు మాన్పించిన వైనం



పొగాకు వినియోగంతో సంభవించే నష్టాలపై నారాయణరావుపేటలోని పాఠశాలలో విద్యార్థులకు వివరిస్తూ..

నెల్లూరు(అర్బన్): సరదాగా ధూమపానం చేయడం.. ఆపై ఈ అలవాటుకు ఎంతో మంది బానిసలవుతున్నారు. ఫలితంగా అనారోగ్యానికి గురై.. ప్రాణాలనూ వదులుతున్నారు. ఈ తరుణంలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో వినూత్న కార్యక్రమానికి వైద్యశాఖ శ్రీకారం చుట్టింది. పొగాకు ఉత్పత్తులను వినియోగించరాదని.. పొగను పీల్చొద్దంటూ ఎన్సీడీ అధికారి యశ్వంత్ పర్యవేక్షణలో ఎన్టీసీపీ సోషల్ వర్కర్ హాసిని ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వివిధ కాలనీల్లో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. విద్యాశాఖ సహకారంతో స్కూళ్లలో కార్యక్రమాన్ని చేపట్టారు.



కోటమిట్టలో అవగాహన కల్పిస్తున్న వైద్యశాఖ ఎన్సీడీ సిబ్బంది

2594 పాఠశాలల్లో ప్రచారం

కార్యక్రమాన్ని గత నెల ఒకటిన ప్రారంభించారు. పొగాకుతో సంభవించే అనర్థాలను జిల్లాలోని 2594 పాఠశాలల్లో గల 7, 8, 9వ తరగతుల విద్యార్థులకు వివరించారు. ధూమపానానికి వ్యతిరేకంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఇంటికెళ్లాక తమ తల్లిదండ్రులతో పాటు ఇరుగు.. పొరుగు వారితోనూ సంతకాలను సేకరించేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలోని 39 మండలాల్లో సుమారు 20 వేల సంతకాలను విద్యార్థులు సేకరించారు.

డీ – అడిక్షన్ సెంటర్‌కు తరలింపు

పొగ పీల్చడాన్ని మానుకునేందుకు గానూ నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గల డీ – అడిక్షన్ సెంటర్‌కు వైద్యశాఖ బృందం తరలిస్తోంది. ఇలా తరలించిన వారికి పెద్దాస్పత్రిలో తగు మందులతో చికిత్సను అందిస్తున్నారు. వైద్యశాఖ లెక్కల మేరకు వెయ్యి మందితో ధూమపానాన్ని మాన్పించారు.

పొగ, మద్యం మానాలనుకుంటే చికిత్స



పొగాకు ఉత్పత్తుల వినియోగంతో కేన్సర్, ఊపిరితిత్తులు లాంటి తీవ్రమైన జబ్బులొస్తున్నాయి. ధూమపానానికి దూరంగా ఉండాలనుకునే వారి కోసం ప్రభుత్వ పెద్దాస్పత్రిలో డీ – అడిక్షన్ సెంటర్ ఉంది. అక్కడికొస్తే సైకియాట్రిస్ట్ పర్యవేక్షణలో చికిత్సను అందించి మాన్పించేందుకు వీలవుతుంది. ఎన్సీడీ సర్వేలో ఎంతో మందిని గుర్తించి ఈ కేంద్రానికి తరలించి చికిత్సను అందించేలా చర్యలు చేపట్టాం. వీరందరూ స్మోకింగ్‌కు దూరమయ్యారు.

– యశ్వంత్, ఎన్సీడీ పీఓ, జిల్లా వైద్యశాఖ

ప్రోత్సాహక బహుమతులు

పొగాకుకు వ్యతిరేకంగా ఎవరైతే ఎక్కువ సంతకాలను సేకరించారో వారిలో మండలానికి ముగ్గురు విద్యార్థులను స్వాతంత్య్ర దినోత్సవాన మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో అభినందించనున్నారు. వీరికి బహుమతిగా ఖరీదైన స్కూల్ బ్యాగులను వైద్యశాఖ అధికారులు అందజేయనున్నారు.



విద్యార్థులకు బహుమతిగా అందజేయనున్న బ్యాగ్

క్రీడా సంఘాలకు ప్రశంసాపత్రాలు

- దరఖాస్తు దాఖలుకు తుది గడువు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జిల్లాలో క్రీడాభివృద్ధికి విశిష్ట సేవలందించిన క్రీడా సంఘాలను స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలతో ఆగస్ట్ 15న సత్కరించనున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా జిల్లాలో క్రీడారంగానికి ఉత్తమ సేవలందించిన సంఘాల నుంచి మూడు కేటగిరీల్లో ప్రతిపాదనలను కోరుతున్నామని చెప్పారు. ఒక్కో కేటగిరీ నుంచి ఒక్కొక్కర్నీ ఎంపిక చేసి సంబంధిత డాక్యుమెంట్లతో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్, కలెక్టర్‌కు సిఫార్సు చేయనున్నామని వెల్లడించారు.

ఇవీ కేటగిరీలు..

- జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తమ క్రీడాకారుల ద్వారా అత్యధిక పతకాలను సాధించిన క్రీడా సంఘం.
- జాతీయ స్థాయిలో పలుమార్లు పోటీలను నిర్వహించిన క్రీడా సంఘం.
- జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల నుంచి క్రీడాకారులను తయారు చేసేందుకు గానూ అత్యధిక శిక్షణ శిబిరాలను నిర్వహించిన క్రీడా సంఘంగా ఉండాలన్నారు. ఈ కేటగిరీల్లో ప్రతిపాదనలను సంబంధిత డాక్యుమెంట్లతో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఐదు గంటల్లోపు అందజేయాలని కోరారు.

వీరు అనర్హులు..

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పారలెల్ అసోసియేషన్లు అనర్హులన్నారు. క్రీడా సంఘాలకు సంబంధించి న్యాయస్థానాల్లో ఎలాంటి వివాదాలు ఉండకూడదని చెప్పారు. జిలా ఒలింపిక్ సంఘంలో గుర్తింపు కలిగి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టరై ఉండాలని తెలిపారు.

పక్కాగా టీకాల నిర్వహణ



వైద్యాధికారులకు శిక్షణ

నెల్లూరు(అర్బన్): షెడ్యూల్ మేరకు గర్భిణులు, శిశువులకు టీకాలను పక్కాగా వేయాలని డీఎంహెచ్ఓ సుజాత సూచించారు. వ్యాధి నిరోధక టీకాలపై నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల వైద్యాధికారులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయడం ద్వారా అనేక వ్యాధులు దరిచేరకుండా అరికట్టొచ్చని చెప్పారు. వీటి పనితీరు బాగుండాలంటే కోల్డ్ చైన్‌ను సక్రమంగా చేపట్టాలని సూచించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్వైలెన్స్ మెడికల్ ఆఫీసర్ మోనిక, టీఓటీ డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ఎన్సీడీ పీఓ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించకుండా అమానుషం

- పోలీసుల సమక్షంలో సామగ్రి తరలింపు
- న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్న వృద్ధురాలు



సామగ్రి తరలింపుపై ప్రశ్నిస్తున్న ధనమ్మ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అద్దె చెల్లించకుండా వృద్ధురాలిపై అధికారులు అమానుషంగా వ్యవహరించిన ఘటన బుచ్చిరెడ్డిపాళెంలో బుధవారం వెలుగుచూసింది. బాధితురాలి వివరాల మేరకు.. పట్టణంలోని సుబ్బారెడ్డిపురంలో నివాసం ఉంటున్న ధనమ్మ తన ఇంటిని సచివాలయం కోసం అద్దెకిచ్చారు. అయితే తొమ్మిది నెలల పాటు బకాయిలను చెల్లించకపోవడంతో మున్సిపల్ అధికారులను ప్రశ్నించగా, ఖాళీ చేస్తామని వారు బదులిచ్చారు. అద్దె చెల్లించకుండా ఖాళీ చేస్తే అంగీకరించేదిలేదంటూ కలెక్టర్‌కు ఆమె ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఈ మొత్తాన్ని చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇటీవల అద్దె నగదును ధనమ్మ ఖాతాలో అధికారులు జమ చేశారు. మరోవైపు ఫర్నిచర్ తదితర వస్తువులు ఇంట్లోనే ఎనిమిది నెలలుగా ఉండటంతో పాటు విద్యుత్ బిల్లును చెల్లించలేదు. ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆమె కోరగా, అధికారులు పట్టించుకోకుండా పోలీసుల సమక్షంలో సచివాలయంలోని సామగ్రిని తరలించారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె అభ్యర్థించారు.

ఎరువులకెళ్తూ.. అనంతలోకాలకు



లింగసముద్రం: ఎరువుల కొనుగోలుకు వెళ్తుండగా, అడవి పందిని తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మొగిలిచర్ల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పీసీపల్లి మండలం గుంటూరు లింగంపల్లెకు చెందిన కరణం నరసింహం (55) వ్యవసాయావసరాల నిమిత్తం ఎరువుల కొనుగోలుకు మాలకొండ మీదుగా అడవి మార్గంలో బైక్‌పై మొగిలిచర్లకు బయల్దేరారు. ఈ తరుణంలో మొగిలిచర్ల సమీపంలోని పంప్‌హౌస్ వద్దకొచ్చేసరికి అడవి పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. అటుగా వెళ్తున్న వారు 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణ తెలిపారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 25.302 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 1250 క్యూసెక్కులు చేరుతోందని చెప్పారు. కండలేరు నుంచి సత్యసాయి గంగకు 1750, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 90, హైలెవల్‌కు 100, మొదటి బ్రాంచ్ కాలువలకు 85 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

బొప్పాయి రైతు కుదేలు

ధరల్లేక నష్టపోతున్న వైనం

- కిలో రూ.ఆరుకే కొనుగోలు
- దళారులు చెప్పిందే రేటు

కలిగిరి: ఆరుగాలం కష్టపడి సాగు చేసి.. దిగుబడులు వచ్చాక ధరల్లేక బొప్పాయి రైతులు కుదేలవుతున్నారు. పలు వ్యాధులకు బొప్పాయి దివ్యౌషధంగా పనిచేస్తుందని వైద్యులు సూచిస్తున్నారు. ఫలితంగా దీన్ని తినడం ఎక్కువైంది. దీంతో సాగుపై రైతులు ఆసక్తి చూపారు.

పెరిగిన సాగు

గతేడాది వరకు బొప్పాయికి మంచి ధరలు పలకడంతో లాభాలను రైతులు ఆర్జించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది సాగు పెరిగింది. గత నెల 15 వరకు తోటల్లో కాయలను కిలో రూ.15 నుంచి రూ.20 వరకు కొనుగోలు చేశారు. అయితే ఇటీవలి కాలంలో దళారులు, వ్యాపారులు రూ.ఐదారుకే కొనుగోలు చేస్తున్నారు. చెట్టుపై ఉన్న కాయలు పండిపోతుండటంతో విధిలేని పరిస్థితుల్లో దళారులు చెప్పిన ధరలకు విక్రయించాల్సి వస్తోంది.



బొప్పాయి తోట



కోతకొచ్చిన కాయలు

మండలం	సాగులో ఉంది (ఎకరాల్లో)
కలిగిరి	140
చేజర్ల	120
కలువాయి	115
వింజమూరు	75
సైదాపురం	75

తీవ్రంగా నష్టపోతూ..

బొప్పాయిని సాగు చేయాలంటే ఎకరాకు రూ.1.5 లక్షల నుంచి రూ.రెండు లక్షల వరకు ఖర్చవుతుంది. ఈ ఏడాది ఇప్పటికి సగం కోతలనే పూర్తి చేశారు. ధరలు అమాంతం తగ్గడంతో దిక్కుతోచని స్థితిలో రైతులున్నారు. కిలోను రూ. ఆరు చొప్పున కొనుగోలు చేస్తే, కనీసం కోత కూలిలూ రావు. నాణ్యత తక్కువగా ఉన్న కాయలను అసలు కొనుగోలు చేయడం లేదు.

ఎగుమతులు తగ్గడమే కారణం

ఈ ప్రాంతంలో పండించే బొప్పాయిని ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. ప్రధానంగా మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, పంజాబ్ రాష్ట్రాల్లో దీని వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఆ ప్రాంత వ్యాపారులు ఇక్కడ ఉత్పత్తయ్యే బొప్పాయికి మంచి ధరలిచ్చేవారు. అయితే ఇటీవల ఆ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురవడంతో మార్కెట్లు తెరవక ధరలు తగ్గుముఖం పట్టాయి. దీన్ని ఆసరాగా చేసుకున్న దళారులు తక్కువ చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

కాయలను తగలబెట్టి నిరసన

కిలోను రూ.ఐదుకే కొనుగోలు చేస్తుండటంతో తాము పండించిన బొప్పాయి కాయలను కలిగిరిలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట గత నెల 31న రైతులు తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.



కాయలను తగలబెడుతున్న రైతులు (ఫైల్)

భారీగా నష్టపోతాం



ఐదెకరాల్లో బొప్పాయిని సాగు చేస్తున్నా. ఎకరాకు రూ.రెండు లక్షల చొప్పున రూ.పది లక్షలను పెట్టుబడిగా పెట్టా. ఇప్పటి వరకు నాలుగు కోతలు జరగ్గా, రూ.నాలుగు లక్షలకూ విక్రయాలు జరగలేదు. కిలోను రూ.ఆరుకూ కొనుగోలు చేయడంలేదు. ధరలు ఇదే విధంగా ఉంటే భారీగా నష్టపోతాం.

– కాకూరి విష్ణువర్ధన్‌రెడ్డి, కలిగిరి

రైతుబజార్లలో అమ్ముకోవచ్చు



నెల్లూరు, కందుకూరు, కావలిలోని రైతు బజార్లలో బొప్పాయిని విక్రయించేందుకు రైతులకు గదులను ఉచితంగా కేటాయిస్తాం. వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు చేపడతాం. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలు తగ్గుముఖం పడితే, ప్రస్తుతం ఉన్న బొప్పాయి ధరలు పెరిగే అవకాశముంది.

– సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానాధికారి, నెల్లూరు